# - తీరని స్మృతి -

రచన :

శ్రీ పప్పుల మాణిక్యం

ఊరిబయట, అందమైన పచ్చని పచ్చికపై, సువాసనలు విరజిమ్మే రంగురంగుల పూలమొక్కల మధ్య..

కమ్మని, తీయని మధురమైన అనుబంధాన్ని కాంక్షిస్తో, అతను ఆమె ఒడిలో నిర్మలమైన కళ్ళతో, ఆరేపనిగా ఆమె ముఖంలోకి, చూస్తోన్నాడు.

ఆ చూపుల్లో తీరని కోరికల తొందర. చిలిపిపనులు చేసే, చమత్కారం తొణికిసలాడుతున్నయ్!

అతన్ని తన్మయత్వంతో కవ్వించే ఆమె అంగసౌష్టవం మరీ పిచ్చోడిని చేసేస్తోంది!

'ఏమిటా చూపు?' సన్నగా వీణ మధుర మంజుల రవంతో-శృతి చేసినట్లు ప్రశ్నించింది ఆమె.

'ఊం...! నీ సౌందర్యం నా సొత్తేకదా అంటోంది, నా మనసు" అన్నాడు ఏదో అనుభూతితో అతను.

గోముగా ఆమె నవ్వింది,

అప్పుడు సొట్టలుపడ్డ ఆ ప్రియురాలి, లేత బుగ్గల్లో అందమైన సిగ్గు గోచరించింది, ఆ ప్రియునికి.

'మనం పెళ్ళి చేసేసుకొందాం!'

'నాకు మాత్రం వుద్దేశ్యం లేదంటావా?'

'మనసులు రెండూ నిర్మలంగా వుండి, కలిసినవాడు అది ప్రేమ. దాని ప్రతిరూపమే పెళ్ళి' అన్నాడు.

'నిత్యం నీ అనురాగమే కావాలి. ఈ జన్మకు అదే పదివేలు!'

'చూడలా! ఆ శక్తి మనిద్దరికీ కావాలి కదూ?'

'సుధా! నా జీవితానికి 'అర్ధం - పరమార్ధం' అన్నీ నువ్వే!'

ఆమె మాటలకు అతని గుండెల్లో స్పందన భావయుక్తంగా వుంది.

'బ్రతుకులో తీయదనం, వయసులో కమ్మదనం కలబోసి అన్నీ నువ్వే!' అంటూ పరవశించిపోతూ ఆమెను ముద్దుల్లో నింపేస్తోన్నాడు.

'వీణకి శృతి. ఆకాశానికి చుక్కలు, చంద్రుని చల్లని వెన్నెల అందం. నువ్వు, నాకే అందం ఆనందం' అన్నది.

కొద్దిసేపు మౌనంగా దొర్లింది కాలం.

'చూడు! మన ఎదురుగా వున్న ఆ కోవెల ఎన్ని పెళ్ళిళ్ళను జరిపిందో అలాగే మన పెళ్ళికూడా...!'

'ఆ అదృష్టం వరించాలనే నా ఆశ సుధా!'

'ఐతే పద.'

'ఎందుకు?'

'పిచ్చిదానా మనం గాంధర్వ వివాహం చేసేసుకొందాం' లేచాడు అతను.

'సుధా!'

'అభ్యంతరమా?'

'అది కాదు...'

'మరైతే ఆలస్యం దేనికి? చూడండి దేవిగారూ! నాతో రండి.'

ఇద్దరూ అప్రయత్నంగా గుడికి వెళ్ళారు. దేవిముందు ప్రమాణంచేసి, ఆమెను తన భార్యగా స్వీకరించాడతను.

ఆ బంధం, శాశ్వత జీవితబంధం కావాలనే పలవరిస్తోన్న సుధాకర్ కు —

'ఒరేయ్! పట్టపగలు ఏమిటా కలవరింతలు?' తట్టిలేపిన మిత్రుని గావుకేకతో, తృళ్ళిపడి లేచాడు సుధాకర్!

ఎదురుగా మోహన్!

సుహాసిని లేదు-మరి అంతా కలా? అతని మొహం వివర్ణమైంది.

కలలు ఎంత కమ్మగా వుంటాయి? నిజమే మరి! సుహాసినితో ఈ జీవితం గడిపేస్తే-ఎంత అదృష్టం? ఆ బంగారు క్షణాల్లో ఎంత ఆనందం?

'నీకు పిచ్చిగాని పట్టిందా? ఏమిటా చూపు?' నవ్వుతూ అరిచాడు మోహన్.

'ఒరేయ్! బంగారంలాంటి కలను పాడుచేశావురా! నిన్ను చంపినా పాపంలేదు' అన్నాడు సుధాకర్.

'బ్రదర్! కలలు నిజంకావు. కేవలం కల్లలు. ఆం నేను బైటకు పోతున్నా' అంటూ ఎదురు మాటకోసం చూడకుండా, వీధినబడ్డాడు మోహన్.

'సుహాసిని! ఎంత మధురమైన పేరు. అందంగా, ఆరోగ్యంగా, సింపుల్ గా వుండే నా ప్రియురాలు... అబ్బ! నా పెళ్ళి జరిగితే, ఆమెతోనే జరగాలి. లేదా?

యిలా మనసులో అనుకొంటూ-పూర్వ లోకాలలో విహరిస్తూ-బాత్ రూంవేపు నడిచాడు సుధాకర్.

*  *  *

అరగంట అనంతరం ట్రిమ్‌గా టాయిలెట్ అయి హుషారుగా, ఈలవేస్తూ-వీధిలోకి వస్తోన్న సుధాకర్‌కు ఓ వ్యక్తి ఎదురై—

'బాబూ! యిక్కడ సుధాకర్ అనే అబ్బాయి వుండాలి, మీకు తెల్సా?' అడిగాడతను.

క్షణం ఆ వ్యక్తిని నఖశిఖ పర్యంతం చూసిన సుధాకర్—

'నేనే!' అన్నాడు.

'నువ్వేనా బాబూ!' అనేసి, ఆప్యాయంగా అతన్ని కౌగలించుకొన్నంత పన్చేశాడా ముసలాయన.

'అచ్చం మీ నాన్న పోలికే!'

'అయితే ఏమంటారు?'

'నా పేరు పరంధామయ్య! ఓనామాల నుంచీ, పెద్దల చదువు వరకూ నేనూ, మీ నాన్న ఒకే బడిలో చదివాం. ఒకే గదిలో వున్నాం. ఒకే కంచంలో తిన్నాం. ఈ వూరు పనుండి వచ్చాను' చెప్పాడు.

'రండి రూములోకి!' ఆహ్వానించాడు సుధాకర్.

ఇద్దరూ అక్కడకు చేరారు. కుర్చీలో కూర్చున్నాడు పరంధామయ్య.

'మీ నాన్న ఈ వుత్తరం నీకు యిమ్మన్నాడు' అంటూ దాన్ని సుధాకర్‌కి యిచ్చి, అతన్నే చూస్తోన్నాడు పరంధామయ్య.


గబగబా వుత్తరం మడతలు విప్పి మనసులో యిలా చదవసాగాడు సుధాకర్!


'బాబూ! సుధాకర్! ఆశీస్సులు!

ఇతను నా ప్రాణస్నేహితుడు. ఓసారి నన్ను నీటి గండంనుండి తప్పించి, ప్రాణదానం చేశాడు. పరిస్థితుల ప్రాబల్యంగా వున్న ఒక్క కూతురి వివాహం జరిపించే స్థితిలో లేక-నీకిచ్చి పెళ్ళిచేయాలన్న ఆశతో వచ్చాడు. సంస్కారపూరంగా యోచించి ఆలస్యం చెయ్యక నా మాటను నిలుపు—

—తండ్రి గోపాలం.

ఏంచెయ్యాలో తోచలేదు సుధాకర్‌కు. శరీరంనిండా






స్వేదబిందువులు ఆవరించాయి. గొంతులో తడారి పోయింది. ఏ నిర్ణయానికి రాలేకపోతున్నాడు.

'ఏమిటి బాబూ! అలా ఐపోయావు?' ఆత్రంగా అడిగాడు పరంధామయ్య.

'అబ్బే! మరి—మరి—తర్వాత—తర్వాత' నీళ్ళు నములున్నాడు సుధాకర్.

'అర్థమైంది బాబూ! బాగా ఆలోచించే నిర్ణయం వ్రాయి వస్తా' నంటూ లేచి వెళ్ళిపోయాడు పరంధామయ్య.

స్థిమితంలేని చిత్తంతో గదిలో పచార్లు చేస్తోన్న అతనికి తపాలా బంట్రోతు ఓ కవర్నిచ్చి వెళ్ళాడు—

చిరాగ్గా దాన్ని చించి చదివాడు. ఇలా వుంది.

'సాయంత్రం గాంధీ పార్కుకు రావాలి! ముఖ్య విషయం మాట్లాడాలి. ఎదురుచుస్తా—

—సుభాషిణి.

ఆమె సుధాకర్ క్లాస్‌మేట్! ఆమె వుత్తరంకి ఏం చెయ్యాలో బోధపడలేదు. సరదాగా ఆమెతో వుండటం తప్ప ఏంలేదు అతన్లో. అయితే ఒంటరిగా పార్కులో? మరీ చికాగ్గా వుందాతని మనస్సు.

అలా సుహాశిని పిలిచివుంటే ఎంత బావుండును? ఆ కళ్ళు, నునుపైన చెక్కిళ్ళు, మేలివర్ణపు మేనిచ్ఛాయ, గులాబీ రేకులవంటి ఆమె పెదాలు, అలా ముద్దులతో ఆమెలో తను, తనలో ఆమె ఐక్యం అయితే? ఎంత పరవశం?

సృష్టికి తీయనిది స్నేహం అయితే_మధురమైనది ప్రేమ. ప్రేమించటం అందరికీ చాతకాదు. అంగట్లో వస్తువూ కాదు. రసమయమైన భావన. సృష్టికి మూలం ప్రేమ! మనిషిలో ప్రేరణ కలిగించేది ప్రేమ.

* * *

సాయంసమయపు నీరెండలో సుభాషిణి నవయవ్వన కన్నె వధువులు నిగనిగలాడిపోతోంది. సుధాకర్ రాక కోసం క్షణమొక యుగంలా నిరీక్షిస్తోంది.

ఏ చప్పుడైనా, అటువేపే ఆశగా చూడటం నిరాశతో కమిలిపోవటం జరుగుతోంది—

శరీరంనిండా విషసర్పాలు ప్రాకినవాడిలా—అక్కడకు రానే వచ్చాడు సుధాకర్.

అమాంతం అతన్ని వాటేసుకోవాలన్న వుబలాటం

కలిగింది సుభాషిణికి. ఎందుకో అలా చెయ్యలేక పోయింది.

'ఎందుకు రమ్మన్నారు?' ఎటో చూస్తూ అడిగాడు.

'తప్పా?' దోషిలా ఎదురు ప్రశ్నించింది.

'విషయం చెప్పండి!'

'ఇలా కూర్చుంటారా?'

'అవసరంలేదు.'

'తిరస్కరించటం...'

'దయచేసి నన్ను విసిగించకండి' అన్నాడు.

'మరి...మరి నాకు పెళ్ళి నిశ్చయమైంది' చెప్పింది.

'చాలా మంచిది. ఈ విషయానికే, ఇక్కడి కెందుకు పిలిచారు?'

'అవసరం గనుక!'

'నాతోనా? ఇది మరీ వండర్ గా వుంది!'

'సుధాకర్! ఈ పెళ్ళి యిష్టంలేదు.'

'మీ వాళ్ళతో చెప్పెయ్యండి. ఇంతకీ ఎవర్నైనా ప్రేమించారా?'

'అవును!'

'అందుకు మీ వాళ్ళు అంగీకరించలేదా?'

'నీ ధోరణి నన్ను బాధపెడుతుంది సుధాకర్! ఐ లవ్ యు సోమచ్!' అంటూ అతని దగ్గరగా వెళ్ళి యింకేమో అనబోయింది సుభాషిణి.

'స్టాపిట్!' అన్నాడు.

'తిరస్కరించకండి!' ప్రాధేయపడింది.

'సుభాషిణీ! ఏ మనిషీ యిద్దర్ని ప్రేమించలేడు. నా మనసు ఏనాడో ఒకరికి అంకితం చేశాను.'

'సుధాకర్!'

'అవును!'

వికలంగా మారిపోయింది ఆమె మనసు. కలలు కరిగిపోయి, ఆశలు నిరాశలుగా బూడిదైపోయి పూర్తిగా చంచలచిత్త అయ్యింది సుభాషిణి.

'తిరస్కరించకు సుధా! నా కలల గూడు విరిచెయ్యకు!' అన్నది పిచ్చిగా.

'క్షమించు!'

'అనటం తేలికే!'

'నా మనసు నాలో లేదు. నాపై ఆశలు పెంచుకొని అనారోగ్యంకు గురికాక—మీ పెద్దలు నిర్ణయించిన పెళ్ళి చేసుకో' అంటూ గబగబా తను వచ్చిన దారి పట్టాడు సుధాకర్!

కళ్ళల్లో నిండిన కన్నీళ్ళతో అలే చూస్తూ, వుండిపోయింది పాపం సుభాషిణి.

నడుస్తోన్న సుధాకర్ మెదడులో ఆలోచనలు దొంతర్లు దొంతర్లుగా వస్తూ-పోతున్నాయి.

ఇప్పుడే సుహాసిని వద్దకు వెళ్ళాలి! తన ప్రేమను ఆమె ముందు వ్యక్తపరచాలి! అన్న దృఢ నిర్ణయంలో అటు దారి తీశాడు సుధాకర్!

సాయంత్రం కాలేజీ వదిలారు! ఒంటరిగా నడుస్తోంది సుహాసిని!


## కావలెను

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు, మరియు బెడ్ షీట్లు ప్రసిద్ధి చెందినవి. వాటిని ప్రతివారూ మెచ్చుకుంటున్నారు. వీటికి ప్రతినిధిగా నున్నవారు మంచి లాభము పొందుతున్నారు.

ఎల్. ఐ. సి. ఏజెంట్లు, రిటైరయిన గవర్నమెంటు పనివారినుంచి, తమ మంచి లాభ పొందుటకు ధరఖాస్తులు కోరబడుచున్నాము.

: తయారించువారు :

# J. P. M. TEXTILES,

**P. B. No. 60 : : BHAVANI-638 301.**

అందానికి, మన్నికకు
రోజా


బనియన్లనే వాడండి

ధైర్యంచేసి పిలిచాడు సుధాకర్ !

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసిందాతని వేపు ఆమె.

'రండి! ఈ చెట్టుక్రింద కూర్చుందాం!'

'ఎందుకూ ?'

'తర్వాత చెప్తా!'

'డబ్బు అప్పు కావాలా ?' అన్నది చిలిపిగా.

'భలే చమత్కారం!' అన్నాడు.

ఇద్దరూ అక్కడ ఆసీనులయ్యారు.

'నిన్న మీ కోసం వచ్చాను, మీరు లేరు' అన్నాడు.

'ఇప్పుడు వున్నానుగా' అన్నది.

'మీతో...!'

'ఆడపిల్లలా సిగ్గుపడక, చెప్పండి!'

విషయం చెప్పాడు సుధాకర్.

అంతా విన్న ఆమె— 'ప్రేమించటం ఒక్కరివలన కాదు. రెండు మనసుల కలయిక! మీరు నన్ను ప్రేమించారు, ఆరాధించారు! బావుంది. మరి నేనూ మిమ్మల్ని.'

'ప్రేమిస్తారు కదూ?'

అదే పొరపాటు. నన్ను అపార్థం చేసుకొన్నారు సుధాకర్! చనువుగా వున్నంత మాత్రాన, ప్రేమిస్తున్నాననుకోవటం శుద్ధ అవివేకం' అన్నది సుహాసిని.

'నా ప్రేమను తిరస్కరించకండి!'

'మీలో లేనిపోని అపోహాలు తొలగించితే, ఒంటికి ఆరోగ్యం, మీకు ప్రేమ జబ్బు పట్టింది. పిచ్చాసుపత్రిలో జాయిను అవ్వండి.'

'కోరి అడిగితే మీ సమాధానం యిదా ?'

'అమ్మాయి చనువుగా వున్నంత మాత్రాన - మీరు అర్థంచేసుకొన్నది యింతేనా ?'

'నన్ను చిత్రవధ చెయ్యవద్దు!'

'పరీక్షలు దగ్గరకొస్తున్నాయి! శ్రద్ధగా చదువుకోండి' అంటూ చరచరా ఇంటివేపు నడిచింది సుహాసిని.

శెలవులకని యింటికి వచ్చిన సుధాకర్ కి అసలు విషయం తండ్రి ద్వారా అప్పుడు తెలిసింది. సుహాశిని పరంధామయ్య కూతురని. అప్పటికే, సుహాశిని పెళ్ళి జరిగిపోయి వారం రోజులయిందని.

గుండెలు అదిరేలా రోదించాడు. భూమ్యాకాశాలు దద్దరిల్లేలా అరిచాడు. చేతులు కాలిన తరువాత ఆకులు పెట్టి ఏంప్రయోజనం ?

పోతే తను ప్రేమించిన వ్యక్తి తనను తిరస్కరిస్తే తనను ప్రేమించిన సుభాషిణిని తిరస్కరించాడు సుధాకర్ !

అదే జీవితంలోని చిత్రం!

వూహాలు బోహిజాలుగా మారి బ్రతుకులు బండ రాళ్ళగా పడుంటున్నాయి! ఆలోచన - అవకాశాలూ! అనం విశ్వంలోకి చొచ్చుకుపోయాయి.

సుధాకర్ గుండెల్లో పిడుగుల వర్షం! మనసులో విరక్తి —!

వెర్రి చూపులు, బిక్కచూపుల్తో శూన్యంగా మిగిలి పోయాడు సుధాకర్ !

## కావలెను

మా ఫాక్టరీలో తయారైన జంకాళాలు, మరియు బెడ్ షీట్లు ప్రసిద్ధి చెందినది. వాడిన ప్రతివారూ మెచ్చుకుంటున్నారు. వీటికి ప్రతినిధిగానున్నవారు మంచి లాభము పొందుతున్నారు.

ఎల్. ఐ. సి. ఏజెంట్లు, రిటైరయిన గవర్నమెంటు పనివారినుంచి, తమ విరామకాలమును వృధాచేయక మా బెడ్ షీట్లు, జంకాళాలకు ప్రతినిధిగావుండి మంచి లాభము పొందుటకు ధరకాస్తులు కోరబడుచున్నాము.

—: వివరములకు :—

**SRI PASUPATHI INDUSTRIALS**

F. B. No. 48 BHAVANI - 638301.